
చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సత్యనారాయణస్వామి వ్రతాలు


భవానీ శంకర ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు


ముషీరాబాద్ మహాకాళి ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న, భక్తులు


దోమలగూడ హనుమాన్ ఆలయంలో జ్వాలాతోరణం పూజలో సలంద్రి శ్రీనివాస్ యాదవ్ తదితరులు


వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు

ఆలయాల్లో కార్తీక పూజలు

● సామూహిక సత్యనారాయణ వ్రతాలు , అభిషేకాలు

చిక్కడపల్లి/కవాడిగూడ/ముషీరాబాద్/రాంనగర్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం, భోలక్‌పూర్‌లోని శివాలయాలు, భవాని శంకర ఆలయాలకు భక్తులు తెల్లవారుజాము నుంచి వచ్చి సత్యనారాయణస్వామి వ్రతాలు, దోమలగూడ హనుమాన్ ఆలయం, కవాడిగూడలోని ముదిగొండ శంకరారాధ్య మఠం, అడ్వకేట్స్ కాలనీలో బాలత్రిపుర సుందరీదేవి ఆలయం, కవాడిగూడకొత్త బజార్‌లోని సంకట విమోచన ఆలయంలో, బాలాంజనేయస్వామి దేవాలయంలో, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జగదీష్ మందిర్ ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున హాజరై ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు కన్నులపండుగగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దఎత్తున హాజరై వ్రతాలు నిర్వహించి ఆయంలో దీపాలు వెలిగించారు. వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పలువురు జంటలు పాల్గొన్నారు. క్షీరలింగేశ్వరమందిరంలో స్వామివారికి పెరుగుతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం జ్వాలాతోరణం, ఏకవార రుద్రాభిషేకాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశదీప పూజ, కార్తీక పురాణ ప్రవచనాలు, భక్తులచే దీపారాధన, ప్రదోషపూజ జరిపారు. ఆయా పూజల్లో వివిధ పార్టీల నాయకులు పాల్గొని పూజలు చేశారు.


శివలింగానికి అభిషేకం చేస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ


ముషీరాబాద్‌లో సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని పూజలు చేసిన బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, దీన్‌దయాల్ రెడ్డి తదితరులు


లక్ష్మీగణపతి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్


భోలక్‌పూర్‌లో సామూహిక సత్యనారాయణ స్వామివ్రతంలో కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షులు మేడి సురేష్ కుమార్ తదితరులు


ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో శివలింగం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


సమావేశంలో అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల కార్యక్రమాలను అడ్డుకుంటాం

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4, 500 కోట్లు నాలుగు రోజుల్లో విడుదల చేయకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల కార్యక్రమాలను అడ్డుకుంటామని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మూసీ సుందరీకణపై ఉన్న శ్రద్ధ ఫీజు బకాయిల విడుదల, స్కాలర్‌షిప్‌ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తరగతులను బహిష్కరించి, కలెక్టర్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం చేపడుతున్నారని పేర్కొన్నారు. 11 నెలల పాలనలో వచ్చిన ఆదాయం, ఖర్చులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. రామకృష్ణ ఆధ్వర్యంలో బీసీ విద్యార్థుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో చాలామంది విద్యార్థులు చదువులను మధ్యలోనే ఆపివేస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని4 నెలలుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నేషనల్ ఓబీసీ రైట్స్‌ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ, బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, సి.రాజేందర్, జి.అనంతయ్య, నందగోపాల్, మోదీ రాందేవ్, ఉదయ్‌నేత, ఎన్.వీరన్న, రవికుమార్, కట్ట లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్

నల్లకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేశ్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలలు గడుస్తున్నా నేటికీ విద్యారంగ సమస్యలపై దృష్టి సారించకపోవడం శోచనీయమని అయన అన్నారు.శుక్రవారం విద్యానగర్‌లోని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) గ్రేటర్ హైదరాబాద్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మహేశ్ మాట్లాడు తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యా లు విద్యార్థులను బలవంతంగా ఫీజులు కట్టాల ఒత్తిడి చేస్తూ వేధింపులకు గురిచేస్తుందని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యేడాది పాలనలో ఉత్సవాలకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు మాత్రం మొండి చేయి చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆసిఫ్, గౌతమ్, హరిజ్ఞ, గణేష్, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు మంజూరు చేయాలి

● దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

చిక్కడపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్, పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్‌లను మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎం. అడివయ్య డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల కోసం ఈ నెల 20 నుంచి డిసెంబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమం చేస్తామని ఆయన తెలిపారు. శుక్రవారం చిక్కడపల్లిలోని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యాలయంలో ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచుతామని వృద్ధులు, వితంతువుల పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచుతామని హామీనిచ్చినారని గుర్తు చేశారు. ఈనెల 20నుంచి 25 వరకు గ్రామాల్లో ప్రచారం, 25న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, 28, 29 తేదీల్లో ఆర్‌డీవో కార్యాలయాల ఎదుట నిరాహారదీక్షలు, డిసెంబర్ 5న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వరమ్మ, కోశాధికారి వెంకటేష్, ఉపాధ్యక్షులు కాషాప్ప, సాయమ్మ, సహాయ కార్యదర్శులు యేషయా, గంగాధర్, నాయకులు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలి

● తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాగర్

చిక్కడపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు.. ఈనెల 23న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో జరిగే చెరుకు రైతు రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సదస్సు పోస్టర్లను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొ. అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, లెల్లెల బాలకృష్ణ తదితరులు ఆవిష్కరించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ చెరుకు రైతుల కష్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీనిచ్చి పదకొండు నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర రూపాయలు 4 వేలు టన్నుకు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారన్నారు. తక్షణం రైతుసంఘాలతో చర్చించి న్యాయమైన ధర రైతాంగానికి అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం హరియాణా, పంజాబ్ తరహాలో స్టేట్ అడ్వయిజరీ ప్రైజ్ ప్రకటించి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాగ్‌లింగంపల్లిలోని హౌసింగ్ బోర్డు దుకాణాల సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని హౌసింగ్ బోర్డు దుకాణాల సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్ కోరారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డు అసోసియేషన్ బాగ్‌లింగంపల్లి అధ్యక్షుడు ఏ.శ్యామ్‌యాదవ్, సభ్యులు రెవెన్యూ, హౌసింగ్‌బోర్డు శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాగ్‌లింగంపల్లిలో హౌసింగ్ బోర్డుకు సంబంధించి 51 షాపులు ఉండగా, వాటిల్లో రెండింటిని కేటాయించిన వారికి రిజిస్ట్రేషన్ చేశారు. మిగతా 49 దుకాణాలను కేటాయించిన వారికి ప్రభుత్వ ధర ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి త్వరలో హౌసింగ్ బోర్డు అధికారులతో మాట్లాడి ప్రభుత్వ రేటు కంటే 10 శాతం రాయితీతో కేటాయించిన వారి పేర్లతో రిజిస్ట్రేషన్ చేయిస్తానని హామీనిచ్చారు. బాగ్‌లింగంపల్లి లోని హౌసింగ్ బోర్డు షాపుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుమార్, సభ్యులు మహేందర్, షరీఫ్, వెంకటేశ్వరరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌యాదవ్ తదితరులు

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. శుక్రవారం గోల్నాక తులసీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో దాదాపు రూ. 9.10 లక్షల చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంటకేశ్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గండికోట జనార్దన్, వై.బుచ్చిరెడ్డి, యూసూఫ్‌షరీఫ్, పి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు

● 18 నుంచి 25 వరకు దరఖాస్తుల స్వీకరణ

నల్లకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లు శ్రీనివాస్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వివిధ పత్రికలు, టీవీ న్యూస్ చానెల్స్‌లో పనిచేస్తున్న జర్నలిస్టుల విజ్ఞప్తి మేరక మరోసారి సభ్యత్వ నమోదు చేపట్టాలని సొసైటీ కార్యవర్గం నిర్ణయించిందని వారు తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరిట రూ. 1,550 బ్యాంక్ డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ), రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, జర్నలిస్టు ఐడీ కార్డు, అక్రిడిటేషన్ కార్డు, ఆధార్ కార్డు, దరఖాస్తు ఫారానికి జత చేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలు వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలోని టీవీ కాలనీ, ఫేస్ 4 ఫ్లాట్ ఫారం నెంబర్ 198లోని సొసైటీ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 91009 33723, 77996 81212 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సేవా నంది, సేవా భూషణ్ జాతీయస్థాయి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సేవా నంది, సేవా భూషణ్ జాతీయస్థాయి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లోని కళాకారులు, రచయితలు, వైద్యులు, క్రీడాకారులు, కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు శుక్రవారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ది బెస్ట్ అకాడమి సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ స్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ మాష్టారు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోపు ఆల్ ది బెస్ట్ అకాడమి, డోర్ నంబర్ 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు తిరుమలగిరి, సికింద్రాబాద్, 15 చిరునామాకు పంపించాలన్నారు. వివరాలకు 9652347207 ఫోన్‌నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

'ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటాం'

ముషీరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉంటూ ఆదుకుంటామని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మీరజ్ సుల్తాన్ ఖురేషీ కరెంట్ షాక్‌తో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ముఠా జైసింహ శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.


అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన వేడుకలను నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వై. శంకర్ యాదవ్, చైర్మన్ జ్ఞానేశ్వర్ గౌడ్ తదితరులు శుక్రవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.
రాంనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి)


వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషి

రాంనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 81 ప్రకారం వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం. కోదండరాం పేర్కొన్నారు. వీఆర్ఏల సమస్యలను పరిష్కారం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతం కావడానికి వీఆర్ఏలు ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో వీఆర్ఏ జేఏసీ అధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ ఎం.కోదండరాం, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ వీఆర్ఏల వ్యవస్థ గ్రామాల్లో పటిష్టంగా పనిచేస్తేనే ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల వద్దకు చేరుతాయన్నారు. వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 2020 సెప్టెంబర్ 9న వీఆర్ఏలకు పేస్కేల్ ఇస్తామని, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని గత ఎన్నికల్లో అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన ఇచ్చిన మాటను అమలు చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వీఆర్ఏ కుటుంబాలకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే 3797 వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ వీఆర్ఏ ఉద్యోగుల వారసులకు ఉద్యోగ నియామక ప్రక్రియ పై ప్రభుత్వం చర్చలు జరిపి పరిష్కారం చేయాలన్నారు. ఈ సమస్యను తాము కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ నాయకులు శ్రీకాంత్; శేఖర్, మధు, సాగర్; శివ, రజనీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

ఓయూ ఇంటర్ కాలేజీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సత్తాచాటిన డాక్టర్ అంబేడ్కర్ కాలేజీ విద్యార్థులు


రాంనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓయూ ఇంటర్ కాలేజీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారు. ఓయూ విశ్వవిద్యాలయం పరిధిలోని కాలేజీస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఎల్.బి. స్టేడియంలో శుక్రవారం అన్వర్ ఉల్ కళాశాల నిర్వహించింది. డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాలకు చెందిన జె.సాయివర్ధన్ 96 కిలోల బరువు విభాగంలో బంగారు పతకం సాధించారు. బి.కార్తీక్ 131 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. సయ్యద్ ఉనైజ్ 110 81 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించారు.67 కిలోల విభాగంలో బి.శరత్‌కుమార్, ఎం.డి. ఆసీఫ్ కాంస్య పతకాలపే సాధించారు. ఎం.లక్ష్మీనర్సింహ 55 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించారు. విజేతలకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ టి.శ్రావణ్ వారికి సర్టిఫికెట్‌లు అందజేసి సన్మానించారు.


పతకాలు సాధించిన విద్యార్థులు

జాతీయ స్థాయి కరాటే పోటీలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పతకాలు

బర్కత్‌పుర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో నిర్వహించిన జాతీయ కరాటే పోటీలలో నగరానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వివిధ కేటగిరీలలో పతకాలు సాధించారు. హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బానమ్మ కటాలో బంగారు పతకం, కుమితేలో కాంస్య పతకం, బసవరాజు, శృతి, సారిక, పవిత్రలు బంగారు పతకాలను సాధించారు. వైష్ణవి, మాధురికి రజత పతకం, జ్యోతి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. శుక్రవారం డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఇన్‌చార్జి నిర్మల, కరాటే మాస్టర్లు పి.శ్రీనివాస్, సాయిఅనీషా, సాయి శివానీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల అప్పీల్ కమిటీ సభ్యుడిగా ఓఎస్.రెడ్డి



రాంనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల అప్పీల్ కమిటీ సభ్యుడిగా డాక్టర్ ఓ.ఎస్.రెడ్డి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని బీజేపీ రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎండల లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రకటించారు. బీజేపీ పటిష్టత కోసం అంకితభావంతో అందిస్తున్న సేవలను గుర్తించి పార్టీ అధిష్ఠానం తనకు ఈ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా డాక్టర్ ఓఎస్ రెడ్డి అన్నారు. పదవి ఇచ్చిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి, బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎండల లక్ష్మీనారాయణ, బీజేపీ సీనియర్ నాయకుడు చింత సాంబమూర్తిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారామయ్య, శాంతికుమార్ తదితరులు

డిసెంబర్ 10న చేనేత పడుగు పేకల ఆత్మీయ కలయిక సదస్సు

రాంనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 10న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేనేత పడుగు పేకల ఆత్మీయ కలయిక సదస్సు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారామయ్య పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చేనేత కార్మికుల సంక్షేమ అభివృద్ధి బోర్డును వెయ్యి కోట్లతో ఏర్పాటు చేయాలని, ప్రతి కార్మికుడికి రూ. 5 లక్షల పెట్టుబడి సాయం అందించాలన్నారు. నూలు రంగుల సబ్సిడీ పథకం, నగదు బదిలీ కొనసాగించాలని, ఇళ్లులేని చేనేత కార్మికులకు హౌస్, వర్క్‌షెడ్ పథకాన్ని పునరుద్ధరించాలని, చేనేత సహకార సంఘాలు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వనం శాంతికుమార్, గంజి మురళీధర్, రజక సంఘం కార్యదర్శి పైళ్ల ఆశయ్య, మత్స్యకార్మిక సంఘం కార్యదర్శి నెల్లెల బాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో వివిధ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫీవర్ ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని అంజయ్యక్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పురా పెట్రోల్‌బంక్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బసంత్‌కాలనీ, లింగంపల్లి, వైశ్యహాస్టల్, వెంకటరమణ థియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ క్రాస్‌రోడ్, చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈడీ తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నడుస్తున్న రైలు దిగబోతూ కింద పడిన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ - కర్నూలు ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న 28 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ఉందానగర్ రైల్వేస్టేషన్ వద్ద నడుస్తున్న రైలు దిగబోతూ జారి కిందపడ్డాడు. గాయపడిన అతడిని ఉస్మానియా ఆస్పత్రికి అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712658584 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




వివరాలను వెల్లడిస్తున్న కాచిగూడ ఏసీపీ రఘు

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న దొంగ అరెస్ట్

● అతడికి సహకరించిన బాలుడు కూడా..

బర్కత్‌పుర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లు చోరీ చేస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం కాచిగూడ పీఎస్‌లో విలేకరులు సమావేశంలో ఏసీపీ రఘు వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన రాందాస్ కుమారుడు షెట్టి రాకేష్ (23) తుర్కయంజాల్ ఇంజాపూర్‌లోని నీలాద్రినగర్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకోసం డబ్బు సంపాదించడానికి దొంగతనాల బాటపట్టాడు. తన ఇంటి వద్ద ఉంటున్న మైనర్(బాలుడు)ను తీసుకొని ద్విచక్ర వాహనంపై రోడ్లపై తిరుగుతూ సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నాడు. ఇటీవల కాచిగూడలో జరిగిన చోరీపై ఎస్ఐ రవికుమార్ బృందం సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా రాకేష్ దొంగతనాలు బయటపడ్డాయి. శుక్రవారం రాకేష్, అతడికి సహకరించిన బాలుడిని అరెస్ట్ చేసి, వారి నుంచి 4 సెల్‌ఫోన్‌లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మైనర్ బాలుడిని బాలుర సదన్‌కు తరలించామన్నారు.